సాక్షి సూర్యాపేట

సోమవారం । 29 । జూలై । 2024



సదుపాయాలు మెరుగుపరుస్తాం
యాదాద్రి కొండపైన భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని టూరిజం కార్పొరేషన్ చైర్మన్ రమేష్‌రెడ్డి అన్నారు. - 10లో



యాదాద్రి.. గొప్ప ఆలయం
యాదాద్రి ఆలయం గొప్పదని శ్రీకాకుళంలో ఉన్న నైమిశారణ్య పీఠం స్వామిజీ బాలబ్రహ్మానంద సరస్వతి అన్నారు. - 10లో



తగ్గిన భక్తుల రద్దీ
జంట నగరాల్లో ఆషాఢం బోనాల నేపథ్యం లో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి భక్తుల రద్దీ తగ్గింది. - 10లో

న్యూస్‌రీల్

30న రెండో విడత రుణమాఫీ

భానుపురి(సూర్యాపేట): సూర్యాపేట జిల్లాలోని 70 వేల మంది రైతులకు రెండో విడత రూ.లక్ష నుంచి రూ.1.50లక్షల వరకు ఉన్న పంట రుణాలు ఈనెల 30వ తేదీన మాఫీ చేయబడతాయని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో విడత రుణమాఫీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో అధికారికంగా ప్రారంభించిన అనంతరం రైతుల అకౌంట్లో డబ్బులు జమ చేస్తారని పేర్కొన్నారు. అదేరోజు ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో రుణమాఫీ వేడుక నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, లబ్ధిపొందిన రైతులు, అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

గీత కార్మికుల సంక్షేమానికి పాటుపడాలి



మాట్లాడుతున్న బొమ్మగాని శ్రీనివాస్

భానుపురి (సూర్యాపేట): బడ్జెట్‌లో కేటాయించిన నిధులను సక్రమంగా ఖర్చు చేసి గీత కార్మికుల సంక్షేమానికి పాటుపడాలని గీతపనివారల సంఘం రాష్ట్ర తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కొండ కోటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గీత కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని, జిల్లాలో కాల పరిమితి తీరిన సొసైటీలకు ఎన్నికలు నిర్వహించి ఆ సొసైటీలకు 5 ఎకరాల భూమిని కేటాయించాలన్నారు. హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మం భిక్షం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో రేగటి లింగయ్య, సంఘం ఆర్గనైజర్ సెక్రెటరీ దొరేపల్లి శంకర్, పాలకూరి బాబు, బూర వెంకటేశ్వర్లు, తొట్ల ప్రభాకర్, సొసైటీ మాజీ అధ్యక్షుడు అనంతుల జానయ్య, బొడ్డు రామచంద్ర, పెద్దపోలు విష్ణుమూర్తి, తండ నర్సయ్య, కొండ వెంకయ్య, సైదులు, శీను, కామేష్, దిండు గల సురేష్ పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు కీలక పదవులు ఇవ్వాలి



మాట్లాడుతున్న తప్పెట్ల శ్రీరాములు

భానుపురి (సూర్యాపేట): అన్ని రాజకీయ పార్టీల్లో బలహీన వర్గాలకు కీలక పదవులు ఇచ్చి సముచిత స్థానం కల్పించాలని సామాజిక న్యాయవేదిక అధ్యక్షుడు భద్రయ్య, టీఎమ్మార్పీఎస్ జాతీయ కన్వీనర్ తప్పెట్ల శ్రీరాములు అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలోని సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో సామాజిక న్యాయపోరాట సమితి వ్యవస్థాపకుడు, న్యాయవాది తల్లమల్ల హస్సేన్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలు–సామాజిక న్యాయం అంశంపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులకు పార్టీలు ప్రాధాన్యత కల్పించకపోవడం శోచనీయమన్నారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు రేపాక లింగయ్య, నాగేందర్ నాయక్, దాసరి శ్రీనివాస్, చలమల్ల నర్సింహ, నాగయ్య, అంజమ్మ, అన్నెపర్తి పద్మ, వెంకట్, జానయ్య, రమేష్, అయోధ్య, నాగయ్య, మంగ్తనాయక్, వీరేష్ నాయక్, దాసరి దేవయ్య, బోయిల అఖిల్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

మిర్యాలగూడ టౌన్: హైదరాబాద్‌లో ఆగస్టు 8వ తేదీన జరిగే బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి సెలక్షన్ పోటీలకు అండర్–13 విభాగంలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన బాలబాలికల జట్టును మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో గల క్లీయో స్పోర్ట్స్‌లో ఎంపిక చేశారు. హైదరాబాద్‌లో ఆగస్టు 8 నుంచి 11వ తేదీ వరకు గోపిచంద్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి సెలక్షన్ పోటీలోఈ జట్లు పాల్గొననున్నాయి. ఈ జట్లకు నల్లగొండ జిల్లా నుంచి టి.అక్షిత్‌రెడ్డి, జి.దీపక్‌నాయుడు, ఎన్.శ్రేష్టారావు, కె.నెవీరెడ్డి, సూర్యాపేట జిల్లా నుంచి ఆర్.కార్తికేయ. బాలగంగాధర్‌రెడ్డి, జి.అన్వీరెడ్డి, ఎం.శ్రీహిత రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను ఉమ్మడి నల్లగొండ జిల్లా స్పోర్ట్స్ చైర్మన్ తోట రంగారావు, జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ ప్రశాంత్, క్రీడా కోచ్ రామకృష్ణ అభినందించారు.

'గృహజ్యోతి'పై అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ పాల్‌రాజ్

భానుపురి (సూర్యాపేట): గృహజ్యోతి పథకంపై అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని, పథకానికి అర్హులై 200 యూనిట్లు వినియోగించుకున్న వారికి జీరో బిల్లులు వస్తున్నాయని విద్యుత్ శాఖ ఎస్ఈ పాల్‌రాజ్ అన్నారు. ఆదివారం సూర్యాపేటలోని ఎస్ఈ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 200 యూనిట్లు అదనంగా వినియోగించిన వారు తప్పక బిల్లులు చెల్లించాల్సిందేనన్నారు. జిల్లాలో జూన్ నెలకు సంబంధించి 1,64,460 సర్వీసులకు జీరో బిల్లులు వచ్చాయని, ప్రభుత్వం నుంచి గృహజ్యోతి పథకానికి రూ.5.23 కోట్లు విడుదలయ్యాయని చెప్పారు. గృహజ్యోతి పథకానికి అర్హులైనప్పటికీ అధిక విద్యుత్ వాడితే బిల్లులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో డిస్కం డీఈ శ్రీనివాస్, ఏడీఈ శ్రీనివాస్, ఎస్ఈఓ సత్యనారాయణ, టౌన్–2 విద్యుత్ ఏఈ యశ్వంత్ పాల్గొన్నారు.

ఆహార తనిఖీలేవీ!

- అధికారులే లేని ఫుడ్‌సేఫ్టీ శాఖ
- జిల్లా కార్యాలయంలో ఒక్కరూ లేరు.. అటెండరే దిక్కు
- లోపించిన పర్యవేక్షణ
- జోరుగా కల్తీ పదార్థాల విక్రయాలు
- ప్రజారోగ్యానికి పొంచి ఉన్న ముప్పు

సూర్యాపేట: కల్తీ వస్తువులు, కల్తీ ఆహార పదార్థాల అమ్మకాలను నియంత్రించాల్సిన జిల్లా ఫుడ్‌సేఫ్టీ శాఖలో అధికారులే లేకుండా పోయారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి లక్ష మంది జనాభాకు ఒకరు, పట్టణ ప్రాంతాల్లో ప్రతి 50వేల మందికి ఒక ఫుడ్ సేఫ్టీ అధికారి ఉండాలి. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఆరుగురు, జిల్లావ్యాప్తంగా 17 మంది అధికారులు ఉండాలి. ఆరునెలల క్రితం వరకు జిల్లాలో ఇద్దరే అధికారులు ఉండగా.. ఇందులో ఒకరు వ్యక్తిగత సెలవులో, మరొకరు లైంగిక వేధింపుల కారణంగా కేసు నమోదు కావడంతో సెలవులో ఉన్నారు. ప్రస్తుతం జిల్లాకేంద్రంలోని కార్యాలయంలో ఒక్క అటెండర్ తప్ప అధికారులెవరూ విధుల్లో లేరు. దీంతో జిల్లాలో ఆహార తనిఖీలు చేపట్టే నాథులే లేకుండా పోయారు. ఫలితంగా అక్రమార్కుల ఇష్టారీతిన కల్తీ పదార్థాలను ఇతర ప్రాంతాలనుంచి జిల్లాకు తెచ్చి తక్కువ రేటుకు అమ్ముతూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు.

అదును చూసి..

జిల్లాలో ఏ ఆహార పదార్థం, తినుబండారాలు కొనాలన్నా కల్తీలేనిదే లేదు. పప్పు నుంచి వంట నూనెల వరకు కాదేది కల్తీకి అనర్హం అన్నట్టు జిల్లాలో కల్తీ వ్యాపారం సాగుతోంది. తోపుడు బండ్ల నుంచి రెస్టారెంట్ల వరకు అన్నింటా కల్తీనే వండి వడ్డిస్తున్నారు. కల్తీని అరికట్టాల్సిన ఫుడ్ సేఫ్టీ శాఖలో అధికారులు, సిబ్బంది ఎవరూ లేకపోవడంతో పర్యవేక్షణ కరువైంది. దీంతో అక్రమ వ్యాపారులు అదును చూసి ఇష్టారాజ్యంగా కల్తీ వ్యాపారం సాగిస్తున్నట్టు ప్రజలు ఆరోపిస్తున్నారు.



సూర్యాపేట కలెక్టరేట్‌లోని ఫుడ్‌సేఫ్టీ అధికారి కార్యాలయం

విజయవాడ, హైదరాబాద్‌ల నుంచి..!

సూర్యాపేట జిల్లాకేంద్రం ఓ వైపు హైదరాబాద్కు, మరోవైపు విజయవాడకు సమదూరంలో 65నంబర్ జాతీయ రహదారిపై ఉంది. దీంతో ఆయా ప్రాంతాల్లో తయారు చేస్తున్న కల్తీ నూనెలు, మసాలాలు, అల్లం, కారం, కల్తీ పప్పులతోపాటు ఇతర నిత్యావసరాలను జిల్లాకేంద్రంతో పాటు కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి పట్టణాలకు తెచ్చి, ఆయా చోట్ల హోటళ్లు, తోపుడు బండ్లు, మిర్చి, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బిర్యానీ పాయింట్లకు విక్రయిస్తున్నట్లు సమాచారం. బ్రాండెడ్ వస్తువులతో పోలిస్తే ఈ కల్తీ వస్తువుల ధర తక్కువగా ఉండడంతో జిల్లాలోని నిరుపేదల అధికంగా కొనుగోలు చేస్తున్నారు. ఇదేకాక క్రూడాయిల్‌లో పామాయిల్ వ్యర్థం కలిపి కాకినాడ నుంచి విజయవాడ మీదుగా సూర్యాపేట, హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నారు. తక్కువ ధరకు లభించే ఈ ఆయిల్‌ను పామాయిల్, పల్లీ, సన్‌ఫ్లవర్ ఆయిల్‌లో కల్తీ చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం.

కల్తీ ఇలా..

మారిన పరిస్థితులు, ఆహారపు అలవాట్లకు అనుగుణంగా సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ వంటి నియోజకవర్గ కేంద్రాలే కాకుండా వివిధ మండల కేంద్రాల్లోనూ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు విచ్చలవిడిగా వెలిశాయి. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి వెంట పదుల సంఖ్యలో రెస్టారెంట్లు, హోటళ్లు నెలకొల్పారు. వీటిల్లో నాసిరకం పదార్థాలు, నాన్‌వెజ్‌లకు కార్న్ ఫ్లోడర్ కలిపి నూనెలో వేయించిన, వివిధ రకాల రంగులు, రసాయనాలు పెట్టి అందంగా అలంకరించి చికెన్ చిల్లీఫ్రై, రోస్ట్, పకోడా మొదలైన పేర్లతో విక్రయాలు జరుపుతున్నాయి. అదేవిధంగా బేకరీలు, బజ్జీ బండ్లు, వైన్ షాపుల సమీపంలో ఉండే ఆహార పదార్థాలు తయారు చేసే హోటల్స్‌ను మొదలుకొని పలు సెంటర్లలో కల్తీ సాస్‌లు, ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫుడ్ సేఫ్టీ శాఖలో సరిపడా అధికారులను నియమించి కల్తీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

510 అడుగులకు సాగర్ నీటిమట్టం

నాగార్జునసాగర్: సాగర్ జలాశయం నీటమట్టం 510.20 అడుగులకు చేరింది. ప్రాజెక్టు కనిష్ట స్థాయి నీటిమట్టం 510 అడుగులు దాటింది. శ్రీశైలం కుడి, ఎడమ విద్యుదుత్పాదక కేంద్రాల ద్వారా 60వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండడంతో సాగర్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. కృష్ణా పరీవాహక ప్రాంతంలోని శ్రీశైలం ఎగువన గల జలాశయాలన్నీ జలకలను సంతరించుకున్నాయి. శ్రీశైలం జలాశయానికి 3,60,483 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. మరో 59 టీఎంసీల నీరు చేరితే గరిష్ట స్థాయికి చేరకోనుంది. వరద ఉధృతి కొనసాగుతుండడంతో నేడో, రేపో గేట్లు ఎత్తే అవకాశం ఉంది.

మూసీకి 830 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కేతేపల్లి: ఎగువన కురుస్తున్న వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఆదివారం ఎగువ నుంచి మూసీకి 830 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టులో గరిష్ట నీటిమట్టం 645 అడుగులు (4.46 టీఎంసీలు) కాగా ప్రస్తుత నీటిమట్టం 642.50 (3.82 టీఎంసీలు)అడుగుల వద్ద ఉంది. ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం మూసీ కుడి కాల్వకు 188 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 283 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతకాలార్చన, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం జరిపారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. ఆ తర్వాత కల్యాణతంతు పూర్తిచేసి శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణమంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

మూడో విడత 'ఆత్మ నిర్భర్' రుణాలు



హుజూర్‌నగర్‌లో వీధి వ్యాపారుల దుకాణాలు

- పట్టణ వీధి వ్యాపారులకు బ్యాంకుల ద్వారా ఆర్థిక చేయూత
- కరోనా తర్వాత నుంచి అందిస్తున్న కేంద్ర ప్రభుత్వం
- ఇప్పటికే రెండు విడతల్లో 17,785 మందికి అందజేత
- సకాలంలో చెల్లించిన వారికి మళ్లీ రూ.50వేల చొప్పున..

ఆర్థికంగా బలోపేతం చేసేందుకే..



మున్సిపాలిటీల్లో వీధి వ్యాపారులు వడ్డీ వ్యాపారుల బారినపడకుండా బ్యాంకుల నుంచి రుణం పొంది ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకే ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. వీధి వ్యాపారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రేణుక, మెప్మా ఇన్‌చార్జి పీడీ, సూర్యాపేట

హుజూర్‌నగర్: జిల్లాలోని మున్సిపాలిటీల్లో వీధి వ్యాపారులకు ఆర్థికచేయూత అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కరోనా తర్వాత నుంచి ఆత్మనిర్భర్ భారత్ స్వనిధి పథకాన్ని అమలు చేస్తోంది. ఇప్పటికే రెండు విడతలుగా 17,785మందిఽ బ్యాంకు రుణాలు అందించింది. సకాలంలో రుణాలు చెల్లించిన వారికి కొంత వడ్డీ భారాన్ని భరిస్తూ వస్తోంది. ఇందులో భాగంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అధికారులు వ్యాపారులకు అవగాహన కల్పిస్తూ మూడో విడత రుణాలు అందిస్తున్నారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలో 1,697 మంది వీధి వ్యాపారులు మూడో విడత రుణం కోసం దరఖాస్తు చేసుకోగా 1,433 మందికి మంజూరు కాగా 1,365 మందికి రుణాలందిచారు.

వీధివ్యాపారులకు మంజూరైన మూడో విడత రుణాలు..


మున్సిపాలిటీ	అర్జీలు	మంజూరు	పంపిణీ చేసింది
సూర్యాపేట	524	413	382
కోదాడ	454	396	376
హుజూర్‌నగర్	379	329	327
తిరుమలగిరి	212	189	182
నేరేడుచర్ల	128	106	98
మొత్తం	1,697	1,433	1,365

సకాలంలో చెల్లిస్తేనే..

జిల్లాలోని మున్సిపాలిటీల్లో పనిచేసే మెప్మా సిబ్బంది, ఆర్పీలు గతంలోనే 14,866 వీధి వ్యాపారులను గుర్తించారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లపై అల్పాహార కేంద్రాలు, కూరగాయలు, పండ్లు, దుస్తులు విక్రయించే వారిని ఈ పథకానికి ఎంపిక చేశారు. వారిలో తొలి విడతలో అర్హులైన వారికి రూ.10వేల చొప్పున మంజూరు చేశారు. అవి తిరిగి సకాలంలో చెల్లించిన వారికి రూ.20 వేల చొప్పున రుణం మంజూరు చేశారు. రెండు విడతల్లో రుణం తీసుకుని సక్రమంగా చెల్లించిన వారికి మూడో విడతలో రూ.50 వేలు వరకు రుణాలు ఇస్తున్నారు.

54 మంది టీచర్లకు పదోన్నతి

- ముగిసిన రెండో విడత ఉపాధ్యాయ ప్రమోషన్ల ప్రక్రియ
- సీనియారిటీ ప్రాతిపదికన ఖాళీల భర్తీ
- నేటి నుంచి విధుల్లోకి ఉపాధ్యాయులు



సూర్యాపేట టౌన్: ఉపాధ్యాయుల రెండో విడత పదోన్నతుల ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా 54 మందికి పదోన్నతులు లభించాయి. పదేళ్ల తర్వాత గతనెలలో మొదటి విడత పదోన్నతులు, బదిలీలు పూర్తి చేసిన విద్యాశాఖ రెండో విడత కూడా పూర్తిచేసింది. అయితే గతనెల 20వ తేదీ వరకు చేపట్టిన ఉపాధ్యాయ పదోన్నతుల్లో నాట్ విల్లింగ్ ఆప్షన్ ఇస్తూ పదోన్నతులు కల్పించారు. దీంతో ఒక్కో ఉపాధ్యాయుడు స్కూల్ అసిస్టెంట్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందేందుకు అర్హత ఉండడంతో ఒక్కొక్కరు మూడు సబ్జెక్టుల్లో కూడా పదోన్నతులు పొంది ఒక సబ్జెక్టును సెలక్ట్ చేసుకుని పదోన్నతి పొందారు. దీంతో మిగతా రెండు పదోన్నతులు ఖాళీగా మిగిలిపోయాయి. వీటన్నింటిని భర్తీ చేయాలని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి విన్నవించడంతో ప్రభుత్వం మిగిలిన ఖాళీలను 1:1 ప్రాతిపదిక సీనియారిటీ ద్వారా పదోన్నతుల ద్వారా భర్తీ చేశారు.

పదోన్నతి ద్వారా భర్తీ అయిన పోస్టులు..

మ్యాథ్స్	2
బయోసైన్స్	4
ఫిజికల్ సైన్స్	01
ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలు	18
సోషల్	10
ఇంగ్లిష్	10
తెలుగు	03
హిందీ	05
పీడీ	01

రోస్టర్ పద్ధతిలో..

గతనెలలో చేపట్టిన పదోన్నతుల్లో జిల్లాలో 641 మంది ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి పొందారు. అయితే ఒక్కో ఉపాధ్యాయుడు మూడు సబ్జెక్టులు ఎంచుకొని అందులో ఒకదాన్నే ఎంచుకొని మిగతా రెండింటిని వదిలిపెట్టడంతో జిల్లాలో 54 పోస్టులు ఖాళీగా మిగిలిపోయాయి. ఇవన్నీ తిరిగి పదోన్నతుల ద్వారా భర్తీ చేశారు. అయితే సీనియారిటీలో అర్హత లున్న ఉపాధ్యాయులు పదోన్నతులు పొందలేకపోయారు. దీంతో మిగిలిన ఖాళీలను భర్తీ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో విద్యా శాఖ అధికారులు పదోన్నతులకు సీనియారిటీ జాబితాను ప్రకటించింది. వారి అర్హతను బట్టి రోస్టర్ పద్ధతిలో పదోన్నతులతోపాటు పోస్టింగ్‌లను కూడా వెబ్ ఆప్షన్ ద్వారా కల్పిస్తూ ఆదివారం రాత్రి పదోన్నతుల ఉత్తర్వులు విడుదల చేసింది. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులంతా సోమవారం నుంచి ఆయా పాఠశాలల విధుల్లో చేరనున్నారు.

మోదీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



సూర్యాపేటలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట): ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి ప్రధాని నరేంద్రమోదీ మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (టీఎమ్మార్పీఎస్) జిల్లా అధ్యక్షుడు బచ్చలకూరి నాగరాజు అన్నారు. ఆగస్టు 6న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తెలంగాణ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించే దీక్ష పోస్టర్లను ఆదివారం సూర్యాపేటలోని ఖమ్మం క్రాస్‌రోడ్డులో గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు బీజేపీ హామీ ఇచ్చి తప్పుతుందని, ప్రస్తుత సమావేశాల్లో చట్టబద్ధత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జ పరశురాములు, పోలంపల్లి శ్రీనివాస్, పిడమర్తి సంపత్, శ్రీకాంత్, శివ, ప్రేమ్‌కుమార్, రాజు, గణేష్, ప్రవీణ్, మురారి, రోహిత్, డి వెంకటరమణ పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్ క్షమాపణ చెప్పాలి



సమావేశంలో పాల్గొన్న వికలాంగుల సంఘాల ఐక్య వేదిక నాయకులు

సూర్యాపేట: వికలాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని లేనిపక్షంలో వికలాంగులకు ఆమె క్షమాపణ చెప్పాలని వికలాంగుల సంఘాల ఐక్య వేదిక జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సూర్యాపేటలోని మిర్చి మార్కెట్ యార్డులో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి హోదాలో ఉండి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మాట్లాడడాన్ని ఖండిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని మలక్‌పేట అంధ ప్రాథమిక పాఠశాల హాస్టల్‌లో అంధ విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వికలాంగుల సంఘాల ఐక్య వేదిక నాయకులు కర్నాటి జయకృష్ణ, చింత సతీష్, ఏలే జానయ్య, ఎం.డీ.జహీర్‌బాబా, కొరివి సైదులు, బంజారా భిక్షపతి, సపవత్ సాగర్‌నాయక్, పఠాని ప్రభాకర్, శ్రీనివాసాచారి, మదనాచారి, యాదగిరి, వెంకన్న, అంజయ్య, మల్సూర్, నాగయ్య, రవి, లింగయ్య, రామ్‌కుమార్, సంతోష్, మధు, నగేష్, ఆరిషియ, పద్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణకు నిధుల్లేవు!

- నేటికీ విడుదలకాని పాఠశాలల గ్రాంట్స్
- సొంతంగా ఖర్చు చేస్తున్న హెచ్‌ఎంలు
- మొత్తం ప్రభుత్వ స్కూళ్లు 950
- విద్యార్థుల సంఖ్య 60వేలు

సూర్యాపేట టౌన్: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు నిధుల కొరత ఏర్పడింది. ప్రభుత్వం ఏటా జూలై మొదటి వారంలో, డిసెంబర్‌లో రెండు విడతలుగా నిధులు విడుదల చేస్తుంది. అయితే పాఠశాలలు పునఃప్రారంభమై నెలన్నర అవుతున్నా ఇంత వరకు స్కూల్ గ్రాంట్స్ నిధులు విడుదల కాలేదు. దీంతో బడుల్లో అవసరమైన వస్తువులు కొనేందుకు తాము సొంత డబ్బులు వెచ్చిస్తూ ఇబ్బందులు పడుతున్నామని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు.



అర్వపల్లిలోని పాఠశాల

నిధులు దేనికంటే..

అయితే తరగతి గదుల నిర్వహణ, హాజరు రిజిస్టర్, విద్యుత్ బిల్లులు, తాగునీరు, చిన్నచిన్న మరమ్మతులు, చాక్ పీసులు, ప్రయోగశాలలకు అవసరమైన సామగ్రి, ఇతర అవసరాలతోపాటు పరీక్షలు, జాతీయ పండుగల నిర్వహణకు నిధులు అవసరం. వీటి నిర్వహణకు పాఠశాలలకు వచ్చే గ్రాంట్స్ నుంచే ఖర్చు చేయాల్సి ఉంటుంది. కానీ మొదటి విడత నిధులు ఇప్పటి వరకు జమ కాలేదు. గతేడాది మొదటి, రెండో విడతలు కలిసి మార్చిలో ఇచ్చి వెంటనే ఖర్చు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రధానోపాధ్యాయులు ఆగమేఘాల మీద వాటి లెక్కలు సమర్పించాలిన వచ్చింది.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా..

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రతి సంవత్సరం ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. విద్యార్థుల సంఖ్య 1 నుంచి 30 వరకు ఉంటే రూ.10వేలు, 31 నుంచి 100లోపు ఉంటే రూ.25వేలు, 101 నుంచి 250 ఉంటే రూ.50వేలు, 251 నుంచి వెయ్యి మంది విద్యార్థులు ఉంటే రూ.75వేలు, వెయ్యి మంది కంటే ఎక్కువగా ఉంటే రూ.లక్ష వరకు వస్తాయి. వీటితో పాఠశాలల్లో చాలా అవసరాలను తీర్చేందుకు అవకాశం ఉన్నా ఇంత వరకు నిధులు విడుదల కాక నిర్వహణ భారంగా మారిందని ప్రధానోపాధ్యాయులు అంటున్నారు.

స్కూల్ గ్రాంట్స్ విడుదల చేయాలి



ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధికి అధికనిధులు కేటాయించడాన్ని హర్షిస్తున్నాం. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు గొప్ప విషయం. వాటితో పాటు పాఠశాలల నిర్వహణకు సంబంధించి స్కూల్ గ్రాంట్స్‌ను వెంటనే విడుదల చేస్తే బాగుంటుంది.

– మట్టపల్లి రాధాకృష్ణ, టీపీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు

హెచ్‌ఎంలు ఇబ్బందులు పడుతున్నారు



పాఠశాలలు ప్రారంభమై నెలన్నర కావస్తుంది. చాక్ పీసులు, చీపుర్లు కొనడం కూడా ఇబ్బందిగా ఉంది. సొంతంగా ఖర్చు పెట్టలేక హెచ్‌ఎంలు ఇబ్బందులు పడుతున్నారు. ఆగస్టులో స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించాల్సి ఉంటుంది. గ్రాంట్స్ విడుదల చేయాలి.

– రేపాక లింగయ్య, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

త్వరలో విడుదలవుతాయి



పాఠశాలల నిర్వహణకు స్కూల్ గ్రాంట్స్ ఈనెలాఖరు వరకు లేక ఆగస్టు మొదటి వారంలో విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అప్పటి వరకు ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకొని విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలి.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


వెంకట్‌రెడ్డి (ఫైల్)

తిప్పర్తి: పాము కాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం తిప్పర్తి మండలంలో చోటుచేసుకుంది. ఎర్రగడ్డలగూడేనికి చెందిన ఏమిరెడ్డి వెంకట్ రెడ్డి (50) పాము కాటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌కు తరలించారు. అక్కడి నుంచి నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చి చికిత్స చేయిస్తుండగా.. ఆదివారం మృతి చెందాడు. కుమారుడు విజయేందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

జూదరుల అరెస్ట్

చిలుకూరు: చిలుకూరు మండలంలోని బేతవోలు గ్రామంలో పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం బేతవోలు గ్రామానికి చెందిన జిల్లా ప్రసాద్ ఇంట్లో చిలుకూరు గ్రామానికి చెందిన కొండా వెంకన్న, కొండా సతీష్, ముక్కా లక్ష్మీనారాయణ, బేతవోలు గ్రామానికి చెందిన గౌరు ప్రసాద్, జువ్వాడి కోటేశ్వరరావు, యిట్టిమల్ల వీరస్వామి, జిల్లా సతీష్, హుజూర్‌నగర్ కు చెందిన చొప్పడి యర్రయ్య, గుండు సైదులు పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి వారిని పట్టుకున్నారు. వారి నుంచి రూ. 58 వేల నగదు, ఆరు సెల్ ఫోన్లు, 5 బైక్‌లు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ సురభి రాంబాబు తెలిపారు.

మర్రిగూడ మండలంలో నలుగురు అరెస్ట్

మర్రిగూడ: మండలంలోని కమ్మగూడ గ్రామ పరిధిలోని బోజ్యతండా శివారులో పేకాట స్థావరాలపై ఎస్ఐ కె.రంగారెడ్డి తన సిబ్బందితో కలిసి ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎల్లంకి జయ, కల్లెట్ల శంకరయ్య, బయ్య శంకర్, బోయపర్తి సంజీవలను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి రూ.18,100 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని నిందితులను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పగిళ్ల శ్రీను, జంగం శంకరప్పలు పరారీలో ఉన్నారని చెప్పారు.

నల్లబెల్లం, నాటుసారా పట్టివేత

చండంపేట: నేరెడుగొమ్ము మండలంలో ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో నల్లబెల్లం, నాటుసారా పట్టుబడింది. ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ సంతోష్ వివరాల ప్రకారం.. నేరెడుగొమ్ము మండలంలో సోదాలు నిర్వహించారు. శ్రీను ఆటోలో 15 బస్తాల నల్లబెల్లం, ఒక బస్తా పటిక, 20 లీటర్ల నాటు సారాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి, ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సీఐ శ్రీనివాస్‌నాయక్, ఎస్ఐ మల్లేష్, శేఖర్‌రెడ్డి, నాగరాజు, మనీషా, ప్రశాంత్ ఉన్నారు.

పెద్దవూర మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన చినపాక జానయ్య గత ఐదు నెలల క్రితం గ్రామం నుంచి మండల కేంద్రానికి వస్తుండగా తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసి పోలీసులను ఆశ్రయించాడు. ఆఫోన్‌ను వినియోగిస్తున్న వ్యక్తి నుంచి పోలీసులు రికవరీ చేసుకుని ఈ నెల 3వ తేదీన బాధితుడికి అప్పగించారు.

తిరుమలగిరి సాగర్ మండలం జానారెడ్డికాలనీ గ్రామానికి చెందిన జటావత్ నీలా బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా మార్గమధ్యంలో పెద్దవూర మండలంలోని పర్వేదుల గ్రామ సమీపంలో ఫోన్ పోగొట్టుకుంది. ఈమేరకు గత నెల 21వ తేదీన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవడంతో ఆ సెల్ ఫోన్ వినియోగిస్తున్న వ్యక్తి నుంచి రికవరీ చేసి బాధితురాలికి ఈ నెల 15వ తేదీన అప్పగించారు.

తిరుమలగిరి సాగర్ మండల కేంద్రానికి చెందిన ఐతగోని శ్రావణ్ తన మొబైల్ ఫోన్‌ను పులిచర్ల గ్రామ సమీపంలో పోగొట్టుకున్నాడు. గత మే నెల 23వ తేదీన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి ఫోన్‌ను రికవరీ చేశారు. బాధితుడికి ఈ నెల 18వ తేదీన ఫోన్‌ను అప్పగించారు. అయితే ఇప్పటివరకు పెద్దవూర పోలీస్‌స్టేషన్ పరిధిలో 20 మందికి చెందిన పోయిన సెల్‌ఫోన్‌లను అప్పగించారు.

సీఈఐఆర్‌తో సత్ఫలితాలు

- చోరీకి గురైన ఫోన్లను అతి తక్కువ సమయంలో రికవరీ చేస్తున్న పోలీసులు
- పెద్దవూర మండలంలో ఇప్పటివరకు 20కి పైగా ఫోన్లు బాధితులకు అప్పగింత


బాధితులకు సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్ఐ వీరబాబు (ఫైల్)

పెద్దవూర: ప్రస్తుతం మొబైల్ చోరీకి గురైనా.. పోగొట్టుకున్నా గుర్తించడం సులువైంది. సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా తిరిగి సొంతం చేసుకునే అవకాశం ఉంది. గతంలో సెల్‌ఫోన్ పోయిందంటే దొరకడం కష్టమనే భావన ఉండేది. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం అంతంత మాత్రంగానే ఉండేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. సెల్‌ఫోన్‌కు సంబంధించిన వివరాలు అన్ని అందుబాటులో ఉంటే కొన్ని గంటల్లోపే దొరుకుతుంది. పోయిన ఫోన్‌ను గుర్తించాలంటే అందులో ఐఎంఈఐ(ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ) కీలకం మారింది. పోయిన ఫోన్‌ను కనుగొనడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. పెద్దవూర మండలంలో ఇప్పటివరకు 20కి పైగా ఫోన్లను బాధితులకు అప్పగించారు.

నమోదు ప్రక్రియ ఇలా..

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను కనుక్కోవాలంటే ఆ ఫోన్ ఎక్కడ పోయిందో ఆ ప్రాంతం వివరాలను పోలీస్ స్టేషన్‌లో ఇచ్చే ఫిర్యాదులో పేర్కొనాలి. ముందుగా సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వాలి. పోయిన సెల్‌ఫోన్ బ్లాక్ చేసేందుకు రిక్వెస్ట్ వస్తుంది. దాన్ని ఎంచుకున్నాక ఫోన్ మోడల్, కంపెనీ, ఐఎంఈఐ నంబర్, బిల్లు నమోదు చేయాలి. బాధితుడి పేరు, చిరునామా, గుర్తింపు పత్రం, ఓటీపీ కోసం ఫోన్ నంబర్ పొందుపర్చాలి. అదేవిధంగా పోలీసులకు అందించే ఫిర్యాదు పత్రం అప్‌లోడ్ చేయాలి. ఈ ప్రక్రియ పూర్తి కాగానే ఓటీపీ వస్తుంది. ఈ వివరాలతోపాటు ఫిర్యాదు కాపీని పోలీస్‌స్టేషన్‌లో అందించాలి. ఆయా వివరాలను పోలీసులు పోర్టల్‌లో నమోదు చేసిన అనంతరం పోగొట్టుకున్న సెల్‌ఫోన్ పని చేయకుండా బ్లాక్ చేస్తారు. ఆ ఫోన్ ఎవరు వినియోగిస్తున్నారో గుర్తించేందుకు నిఘా పెడతారు. సీఈఐఆర్ పోర్టల్‌లో వారి సమాచారం తెలుసుకుంటారు. వారి నుంచి ఫోన్ రికవరీ చేసుకుని బాధితులను పిలిపించి అందజేస్తారు. అనంతరం ఐడీ నంబర్ ద్వారా అన్‌బ్లాక్ చేసుకుని వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

ఫోన్ ఆచూకీ తెలుసుకోవడానికి సీఈఐఆర్ దోహదం



సెల్‌ఫోన్ చోరీకి గురైనా, పోగొట్టుకున్నా సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. దీని ద్వారా ఆ ఫోన్ వినియోగిస్తున్న వ్యక్తి ఆచూకీ తెలుసుకోవడానికి దోహద పడుతుంది. పెద్దవూర మండలంలో ఇప్పటివరకు 20కి పైగా పోగొట్టుకున్న, దొంగతనానికి గురైన సెల్‌ఫోన్‌లను బాధితులకు అప్పగించాం.

– పి.వీరబాబు, ఎస్ఐ, పెద్దవూర

సదుపాయాలను మెరుగుపరుస్తాం

- కొండ కింద నాలుగు ఎకరాల్లో రోప్ వే ఏర్పాటుపై ఆలోచిస్తాం
- టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి


టూరిజం హోటల్ సమీపంలో మరమ్మతు పనులు పరిశీలిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి

యాదగిరిగుట్ట: యాదాద్రి కొండపైన ఉన్న హరిత టూరిజం హోటల్‌ను అభివృద్ధి చేసి, భక్తులకు మరింత మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం యాదాద్రీశుడిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం కొండపైన ఉన్న హరిత టూరిజం హోటల్, కొండ కింద ఉన్న టూరిజంకు చెందిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. యాదాద్రి కొండపైన ఉన్న హరిత హోటల్‌ను అభివృద్ధి చేయాలని ఇటీవల జరిగిన సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. టూరిజం హోటల్‌లో 30 గదులు ఉండగా.. ప్రస్తుతం 15 గదులు మాత్రమే భక్తులకు అందుబాటులో ఉన్నాయని, మరో 15 గదులకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించి, మూడు నెలల్లో పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా ఆలోచన చేస్తున్నామన్నారు. టూరిజానికి కొండ కింద 4 ఎకరాల స్థలం ఉందని, అందులో భక్తుల బస కోసం, రోప్ వే చేసే ప్లాన్ చేసేందుకు కృషి చేస్తామన్నారు. యాదాద్రి ఆలయంతో పాటు చుట్టు పక్కల టెంపుల్ సర్క్యూట్‌కు ప్లాన్ చేస్తున్నామన్నారు. యాదాద్రి ఆలయంలో పాటు మరో మూడు, నాలుగు ఆలయాలను కలిపి భక్తులు సందర్శించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి కొలనుపాకలోని ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

తపాలా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్: తపాలా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మిర్యాలగూడెం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ గ్రూప్– సీ పోస్ట్‌మన్, ఎంటీఎస్ గ్రామీణ డాక్ సేవక్ సూర్యాపేట డివిజన్ వార్షిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆల్ ఇండియా సెక్రటరీ జనరల్ వాసిరెడ్డి శివాజీ మాట్లాడుతూ.. 2023 డిసెంబర్‌లో స్ట్రైక్ పేరుతో తొలగించిన 12 మంది జీడీఎస్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కరోనా సమయంలో బకాయిపడిన 18 నెలల డీఏ బకాయిలను విడుదల చేయాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. స్థానికంగా గ్రామీణ తపాలా ఉద్యోగులపై టార్గెట్‌ల పేరుతో పోస్టల్ ఉద్యోగుల ఒత్తిడిని అరికట్టాలన్నారు. అనంతరం 2024–2026 నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ గ్రూప్– సీ అధ్యక్షుడిగా డి. సుధాకర్, కార్యదర్శి పరమేశం, పోస్ట్‌మన్ యూనియన్ అధ్యక్షుడిగా కోటయ్య, కార్యదర్శిగా రాంబాబులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సూర్యాపేట పోస్టల్ డిపార్ట్‌మెంట్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, సంఘం తెలంగాణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, తెలంగాణ క్లాస్–3 కార్యదర్శి రామ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ సంఘం కార్యదర్శి యోగేశ్వర్ రావు, నల్లగొండ డివిజన్ కార్యదర్శి హెమ్లా నాయక్, పోస్టల్ డివిజన్ నాయకులు సుధాకర్, రవి, పరమేష్, మహేష్, కోటయ్య, సిరాజుద్దీన్, కిషన్ నాయక్, ఉపేందర్‌రెడ్డి తదితరులున్నారు.

బస్సు ఎక్కుతుండగా పర్సు అపహరణ

- దొంగను వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగింత
- మహిళ ధైర్యాన్ని అభినందించిన పోలీసులు

నేరేడుచర్ల: మహిళ చేతిలో ఉన్న పర్సును తీసుకొని వెళ్తున్న దొంగను ఆ మహిళ వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించింది. నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన చిమట భవాని పాలకీడు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న తన కుమార్తె దగ్గరకు వెళ్లి తిరిగి నేరేడుచర్లకు చేరుకుంది. పండ్లు తీసుకొని బస్సు ఎక్కుతుండగా నల్లగొండకు చెందిన పంతంగి రవి అనే వ్యక్తి ఆమె వద్ద ఉన్న పర్సును దొంగలించుకొని వెళ్తున్నాడు. గమనించిన భవాని అతడిని వెంబడించింది. ఈ క్రమంలో రవి హోటల్‌లోకి వెళ్లాడు. అక్కడికి చేరుకున్న భవాని అన్న నా పర్సు ఇవ్వండి అని అడిగింది. దీంతో అతను తాను దొంగను కాదని వాదనకు దిగాడు. బాధిత మహిళ అతడి జేబులో పర్సు ఉండడాన్ని గుర్తించింది. స్థానికులు అతడి పాయింట్ నుంచి పర్సును బయటకు తీశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని అతడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. అయితే దొంగని వెంబడించి, పట్టించిన మహిళ ధైర్యానికి పోలీసులు, స్థానికులు ఆమెను అభినందించారు.

యాదాద్రి గొప్ప ఆలయం


ఆలయ సన్నిధిలోని సాంస్కృతిక మండపంలో ప్రవచిస్తున్న బాల బ్రహ్మానంద సరస్వతి

యాదగిరిగుట్ట: కృష్ణశిలతో రూపుదిద్దుకున్న యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రమని ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళంలో ఉన్న నైమిశారణ్య పీఠం స్వామిజీ బాల బ్రహ్మానంద సరస్వతి అన్నారు. ఆదివారం యాదాద్రీశుడిని దర్శించుకున్న అనంతరం ఆలయ సాంస్కృతిక మండపం వద్ద భక్తులకు ప్రవచనాలు చేశారు.

మమ్మల్నే డబ్బులు అడుగుతారా!

- నేరేడుచర్లలో వీధివ్యాపారులపై ఖాకీల ఆగడాలు
- కూరగాయలు, మాంసాహారం ఉచితంగా తీసుకెళ్తున్న పోలీసులు
- డబ్బులు అడిగితే ఎస్ఐ పేరు చెప్పి బెదిరింపు

నేరేడుచర్ల: నేరేడుచర్లలో చిరు వ్యాపారులను సైతం పోలీసులు వదలడం లేదు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ముగ్గురు పోలీసులు ఏకంగా ఎస్ఐ పేరుతో కూరగాయల వ్యాపారులు, పాలు, పండ్లు, బజ్జీలు, చికెన్, మటన్ దుకాణాదారుల నుంచి సామగ్రిని ఉచితంగా తీసుకెళ్తున్నారు. ఆదివారం స్థానిక హుజూర్‌నగర్ రోడ్డులో గల కూరగాయల దుకాణం వద్దకు వచ్చిన ఓ హోంగార్డ్ కూరగాయలు తూకం వేయకుండానే సంచిలో వేసుకున్నాడు. ఎస్ఐ పేరు చెప్పి వెళ్లిపోతుండడంతో మహిళా వ్యాపారి అడ్డుకుంది. ప్రతి నెలా ఎన్ని సార్లు వస్తారు.. గతంలో నాలుగైదు సార్లు ఇచ్చాం కదా.. మళ్లీ ఉచితంగా ఇవ్వాలంటే మేము బతికేది ఎట్లా అని మహిళ అతడితో వాదనకు దిగింది. దీంతో హోంగార్డు వంద నోటు ఆమె చేతిలో పెట్టి వెళ్లిపోయాడు. తమ వద్ద కూడా ఇలాగే వస్తువులను ఉచితంగా తీసుకెళ్తున్నారని మిగిలిన వీధి వ్యాపారులు ఆరోపిస్తున్నారు. చిన్న చిన్న వ్యాపారం చేసుకుంటున్నామని, వారు అడిగినవి ఇవ్వకపోతే వేధింపులకు గురి చేస్తారేమోనని భయపడి తమకు నష్టం జరిగినా ఇస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా ఈ విషయంపై పట్టణంలో చర్చ సాగుతున్నప్పటికీ పోలీసు అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

వసూళ్ల విషయం నా దృష్టికి రాలేదు

నేరేడుచర్ల పట్టణంలో పోలీసులు చిరు వ్యాపారుల వద్ద సామగ్రి ఉచితంగా తీసుకువస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. దీనిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదు. ఈ విషయంపై పూర్తి స్థాయిలో విచారణ చేసి, ఇది వాస్తవమని తేలితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

– రవీందర్‌నాయక్, ఎస్ఐ, నేరేడుచర్ల

ఆటో బోల్తా.. ఐదుగురికి గాయాలు

నిడమనూరు: మండలంలోని వెంగన్నగూడెం స్టేజీ సమీపంలో నిడమనూరు వైపు వస్తున్న ఆటో బోల్తా పడడంతో ఐదుగురు కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. సూరేపల్లి గ్రామానికి చెందిన మహిళా కూలీలు త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి వద్ద వరి నాట్లకుగాను అదే గ్రామంలోని శివకు చెందిన ఆటోలో వెళ్లి వస్తున్నారు. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో వెంగన్నగూడెం స్టేజీ సమీపంలోకి రాగానే గేదెను తప్పించే క్రమంలో ఆటో అదుపుతప్పి పక్కనే ఉన్న పంట కాలువలోకి పల్టీ కొట్టింది. ఆటోలో 15మంది వరకు ఉండగా అందులోని వరమ్మ, భవాని, మల్లమ్మ, వెంకటమ్మ, పావనిలకు స్వల్పగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో మిర్యాలగూడకు తరలించారు.

సిమెంట్ షాపులో నగదు చోరీ

సూర్యాపేటటౌన్: సూర్యాపేట పట్టణంలోని సిమెంట్ షాపులో శనివారం అర్ధరాత్రి ఓ వ్యక్తి నగదు అపహరించాడు. గుర్తు తెలియని వ్యక్తి సిమెంట్ షాపుపై ఉన్న రేకులను తొలగించి లోపలికి ప్రవేశించాడు. కౌంటర్‌లో ఉన్న రూ.35వేల నగదును అపహరించాడు. శ్రీనివాస్ ఆదివారం ఉదయం షాపు తెరిచి చూడగా రేకులు తొలగించి ఉండటంతో అనుమానం వచ్చి కౌంటర్‌లో ఉన్న నగదును చూసుకోగా దొంగతనానికి గురైనట్లు గ్రహించాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. ఈమేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు సురేష్


సిల్వర్‌మెడల్‌తో సురేష్ నాయక్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ సౌత్ జోన్ టోర్నమెంట్ పోటీల్లో తిరుమలగిరి మండలంలోని రంగుండ్ల తండాకు చెందిన ధరావత్ సురేష్ నాయక్ ప్రతిభ కనబరిచాడు. భారత్ స్పోర్ట్స్ ట్రస్ట్, సిత్రులి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌లో ఈనెల 25 నుంచి 27 వరకు వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ సౌత్‌జోన్ పోటీలు జరిగాయి. ఫైనల్‌లో సురేష్ నాయక్‌కు సిల్వర్ మెడల్ దక్కింది. దీంతో అక్టోబర్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

స్వర్ణగిరి దేవాలయాన్ని దర్శించుకున్న సజ్జనార్


సజ్జనార్‌కు స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని ఆదివారం టీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఎండీ సజ్జనార్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో వేర్వేరుగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు వారికి ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం వారికి ప్రసాదాలను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నల్లగొండక్రైం: పట్టణంలోని చర్లపల్లి సప్తగిరి విలాస్ వద్ద రోడ్డుదాటుతున్న మహిళను నార్కట్‌పల్లి వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన రమావత్ మంగమ్మ (40) చర్లపల్లిలో అద్దె నివాసంలో ఉంటూ కూలి పనుల కోసం భర్త బిచ్చతో కలిసి వచ్చింది. పని నిమిత్తం రోడ్డు దాటుతున్న మంగమ్మను కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త బిచ్చ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

చింతపల్లి: హైదరాబాద్ –నాగార్జున సాగర్ జాతీయ రహదారిపై చింతపల్లి మండల పరిధిలోని వింజమూరు గేట్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వింజమూరు తండాకు చెందిన రామావత్ కేశ్యానాయక్(55) గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటికి వెళ్తుండగా జాతీయ రహదారి దాడుతుండడంతో చింతపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అతివేగంతో వచ్చి ఢీకొట్టింది. దీంతో కేశ్యానాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్మీ జవాన్ కుటుంబానికి ఆర్థిక సాయం


మహేష్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న బుసిరెడ్డి పాండురంగారెడ్డి

హాలియా: అసోం రాష్ట్రంలో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్న ఈరేటి మహేష్ ఇటీవల అస్వస్థతకు గురై మృతి చెందాడు. బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి ఆదివారం మదారిగూడెంలో మహేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట తిరుమలగిరి మాజీ వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, అనుముల మాజీ ఎంపీపీ సుమతి పురుషోత్తం యాదవ్, నాయకులు జనార్దన్ రెడ్డి, నడ్డి లింగయ్య యాదవ్, శ్రీను, బెడ్డూరి వెంకట్‌రెడ్డి, రిక్కల రామకృష్ణారెడ్డి, ఆవుల జనార్దన్, కొత్త వెంకన్న, రిక్కల అచ్చిరెడ్డి, కర్ణ హరి, రావుల రామాంజి తదితరులున్నారు.

యాదాద్రిలో తగ్గిన భక్తుల రద్దీ


ఆలయ ఆవరణలో భక్తులు

యాదగిరిగుట్ట: హైదరాబాద్, సికింద్రాబాద్‌లో ఆషాఢం బోనాల నేపథ్యంలో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి భక్తుల రద్దీ తగ్గింది. ఆదివారం శ్రీస్వామిని దర్శించుకునేందుకు భారీగా భక్తులు తరలివచ్చే వారు. బోనాల పండుగ జరుగుతుండడంతో భక్తుల రాక తగ్గింది. శ్రీస్వామి వారిని 25వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారి ఆలయానికి నిత్యాదాయం రూ.23,53,996 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

యాజమాన్య పద్ధతులతోనే పంటలకు రక్షణ

- సస్యరక్షణ చర్యలపై కేవీకే సేద్యపు విభాగం శాస్త్రవేత్త చంద్రశేఖర్ సూచనలు


బాబాసాయిపేటలో నాటు వేసిన వరిపాలం


పాడిపంట

త్రిపురారం : ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నుంచి రైతులు తక్షణమే వివిధ పంటల సాగులో సస్యరక్షణ చర్యలతో పాటు యాజమాన్య పద్ధతులు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కంపాసాగర్ సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ సూచనలు చేశారు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- నీరు సంవృద్ధిగా ఉన్న ప్రాంతాలలో రైతులు స్వల్పకాలిక రకాలు(120 నుంచి 125రోజులు) వరి రకాల నారుమళ్లను ఈనెల 31వతేదీ వరకు పోసుకోవడానికి అనువైన సమయం.
- వరినాట్లు వేసుకునే వారం రోజులు ముందు ఎకరాకు సరిపోయే నారు మడికి 800గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఇసుకలో కలిపి చల్లుకోవడంతో పంటను 15నుంచి 20రోజులు వరకు కొన్ని రకాల చీడపీడల నుంచి కాపాడుకోవచ్చు.
- ఇప్పటి వరకు నారు పోయని రైతులు వర్షాలను సద్వినియోగం చేసుకొని పొలాలను దమ్ము చేసి వరి పంటను నేరుగా విత్తే పద్ధతిలో విత్తుకోవచ్చు. సమయం, పెట్టుబడి ఆదా అవుతుంది.
- 25నుంచి 30రోజుల వయసు ఉన్న స్వల్పకాలిక, మధ్యకాలిక వరి రకాలను నాటు వేసుకోవచ్చు.
- దీర్ఘకాలిక వరినారు (50రోజుల వయస్సు) ఆలస్యంగా నాటాల్సి వచ్చినప్పుడు నారు ఆకుచివర్లు తుంచి వేసి కుదురుకు 6నుంచి 8 మొక్కల చొప్పున నాటుకోవాలి.
- నత్రజని ఎరువులను సిఫార్స్ కంటే 25శాతం పెంచి మూడు దఫాలుగా పంటకు వేసుకోవాలి.
- నాటు వేసిన తరువాత ప్రతి రెండు మీటర్లకు కాలిబాటలు తీసుకోవాలి. కాలిబాటతో గాలి, వెలుతురు పంటకు అందడం వల్ల సుడిదోమ ఉధృతిని నివారించుకోవచ్చు. ఎరువులు, పురుగు మందులు పంటకు అందించడానికి సలువుగా ఉంటుంది.
- వరినాట్లు వేసిన 10నుంచి 15రోజుల మధ్య ఎకరానికి 10కేజీల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను వేసుకోవడంతో కాండం తొలుచు పురుగు, ఉల్లికోడును నివారించుకోవచ్చు.

పత్తి : వర్షాలు తగ్గిన వెంటనే 20నుంచి 40రోజుల వయస్సు ఉన్న పత్తి మొక్కలకు ఎకరాకి 25కేజీల యూరియా, 20కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రసాయనిక ఎరువులను మొక్కల మొదళ్ల వద్ద 7నుంచి 10సెంటీ మీటర్ల దూరంలో పాదులో వేసి కప్పి వేయాలి.

- ముంపునకు గురైన పంట త్వరగా కోలుకోవడానికి 19:19:19 లేదా 13-0-45 లేదా 10గ్రాముల యూరియా లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.
- నేల ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్లను నివారించడానికి 3గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2గ్రాముల కార్బెండైజిమ్, మ్యాంకోజేబ్ శిలీంద్రనాశక మందులను లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచే విధంగా వారంలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- పత్తి పంటలో గడ్డిజాతి, వెడల్పు ఆకుకలుపు మొక్కలను నివారించడానికి 2నుంచి 3ఆకుల దశలో ఉన్న కలుపు మొక్కలకు 2మి.లీ క్విజలోఫామ్ ఇథల్+1.25 మి.లీ పైరిథాయోబ్యాక్ సోడియం కలుపు మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

వేరుశనగ : వేరుశనగ పంటలో మొదలు కుళ్లు తెగులు ఆశిస్తే నివారణకు మొక్కల మొదళ్ల దగ్గర 2గ్రాముల కార్బండిజమ్, మ్యాంకోజేబ్ మందును లీటరు నీటికి కలిపి నేలను తడపాలి.

కూరగాయలు : టమాట, వంగ, మిరప, బంతి పంట నారుమళ్లలో నారు కుళ్లు తెగులు నివారణకు 3గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి నేల పూర్తిగా తడిచే విధంగా పిచికారీ చేయాలి.

– ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కూరగాయల పంటల్లో ఆకుమచ్చ తెగులు సోకడానికి అనుకూలం. తెగులు నివారణకు 1గ్రాము కార్బెండిజమ్ లేదా ప్రోఫికోనాజోల్ మందును లీటరు నీటిలో కలిపి 15రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

కంది : పత్తి పంటలో ఫైటాఫ్తోరా ఎండు తెగులు ఆశించడానికి అనుకూలం. తెగులు గమనించిన వెంటనే నివారణకు 2గ్రాముల మెటాలాక్సిక్ మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.